క్లుప్తంగా

ముగిసిన మార్నింగ్ స్టార్స్ షటిల్ పోటీలు



మార్నింగ్ స్టార్స్ షటిల్ పోటీల విజేతలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా క్లబ్ ఇండోర్ బ్యాడ్మింటన్ హాల్‌లో జరుగుతున్న మార్నింగ్ స్టార్స్ షటిల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 15 జట్లు పాల్గొన్నాయి. విన్నర్స్‌గా తాతాజీ–లోకేష్, రన్నర్స్‌గా షాలేమ్–లక్ష్మీరెడ్డి నిలిచారు. మూడోస్థానంలో బి.శ్రీనివాస్–రమేష్, నాలుగో స్థానంలో కృష్ణంరాజు–నవీన్ ఉన్నారు. విజేతలకు డి.నాగేశ్వరరావు బహుమతులు, షీల్డ్స్, టీ షర్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు రామకృష్ణ, హరి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విక్టర్ షాటకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీలో 3వ ఇన్విటేషనల్ జాతీయ స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను విక్టర్ షాటాఖాన్ కరాటే వ్యవస్థాపక చైర్మన్ ఆర్.మల్లికార్జునగౌడ్, పోటీల నిర్వాహకులు డి.శంకర్రావు ప్రారంభించారు. లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాలో ఉన్న సీనియర్ కరాటే మాస్టర్లను అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి జార్జి,విక్టర్‌షాట్‌కాన్ కరాటే అసోసియేషన్ కార్యదర్శి ఎంవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సూర్య నమస్కారాలు



సూర్య నమస్కార పూజలు చేస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో ఆదివారం సూర్య నమస్కార పూజలు వైభవంగా నిర్వహించారు. ఆర్చకులు ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గాంధీనగర్ గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

బాలాజీచెరువు: విద్యార్థులు గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ శాఖ లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు పేర్కొన్నారు. కుళాయి చెరువు ఆవరణలో ఉన్న గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం–సండే స్టోరీ టైం కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో కథలు, గలివర్ సాహసయాత్ర వంటి పుస్తకాలు చదివించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు, కథల నీతులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు పీవీ రావు




కరపలో పీవీ రావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ నాయకులు

కరప: దళితుల ఐక్యత కోసం పోరాడి, ప్రాణాలనే అర్పించిన మానవతావాది, పోరాట యోధుడు మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు అని మండల అంబేడ్కర్ యువజనసేవా సంఘం గౌరవాధ్యక్షుడు ఊబా ఏడుకొండలు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న రాజ్యాంగ కర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు (పోతుల విఘ్నేశ్వరరావు) వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్సీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘాల, పీవీ రావు మాలమహానాడు నాయకులు జిల్లా శివ కుమార్, దండంగి శ్రీనివాస్, మొసలి శ్యామ్, పోలినాటి లక్ష్మణ్, చిన్నం పెద్దవీర్రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి

- మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్
- కట్టకుంటే కుళాయిలు కట్
- నోటీసులు జారీ చేసిన మున్సిపాలిటీ



కాకినాడ నగరం వ్యూ

కాకినాడ: ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టిపెట్టింది. దీర్ఘకాలంగా వసూలు కాని బకాయిలను రాబట్టే దిశగా స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. మొండి బకాయిదారుల నుంచి పన్ను రాబట్టేందుకు ఇప్పటికే నోటీసులు ఇచ్చింది. అవసరమైతే కుళాయి కనెక్షన్లు తొలగించడంతోపాటు కఠిన చర్యలకు కూడా సమాయత్తమవుతోంది. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 82 వేల అసెస్‌మెంట్ల ద్వారా ఏటా ప్రభుత్వ బకాయిలు మినహా ప్రజల నుంచి రూ.54 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే 31 కోట్లు వసూలు అయ్యింది. ఇంకా రూ.23 కోట్లు వసూళ్లు కావాల్సి ఉంది. అయితే ఆస్తి పన్నుకు సంబంధించి దాదాపు 17,209 మంది నుంచి రూ.8.19 కోట్లు మొండి బకాయిలు పేరుకుపోయాయి. ఈ సొమ్ములో కేవలం ఇప్పటి వరకు రూ.2 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకా ఆరు కోట్ల రూపాయలు వసూలు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఏళ్ల తరబడి బకాయిలకు స్పందించని సుమారు 500 మంది పన్ను చెల్లింపుదారులను గుర్తించి తాజాగా నోటీసులు ఇచ్చారు. 15 రోజుల్లో కుళాయి కనెక్షన్ తొలగించకపోతే అత్యవసర సేవలపై కూడా ప్రభావం చూపించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

రూ.5 కోట్ల వీఎల్‌టీ బకాయిలు

పనిలో పనిగా ఖాళీ స్థలాల పన్నుపై కూడా నగరపాలక సంస్థ దృష్టి పెట్టింది. కమిషనర్ భావన ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ మనోహర్ పర్యవేక్షణలో ఇందుకు సంబంధించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఖాళీస్థలాల పన్నుబకాయిలపై పడ్డారు. తాజా లెక్కల ప్రకారం సుమారు రూ.5 కోట్లు బకాయిలు ఉండగా, ఇప్పటి వరకు 1.43 కోట్లు మాత్రమే వసూలు అయ్యింది. ఈ నేపథ్యంలో బకాయిలు రాబట్టేందుకు దృష్టి సారించారు. బకాయిలు చెల్లించకుండా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారిని గుర్తించి నోటీసులు ఇవ్వడంతోపాటు ఖాళీ స్థలాల్లో నోటీసు బోర్డులు కూడా పెడుతున్నారు. ఇక కుళాయి కనెక్షన్లకు సంబంధించి భారీగా బకాయిలు ఉన్నాయి. వీటిని కూడా రాబట్టేందుకు దృష్టి పెట్టారు. కాగా రెండో అర్ధ సంవత్సరం ముగింపు దగ్గరపడుతున్న నేపథ్యంలో వడ్డీ లేకుండా పన్ను చెల్లించేందుకు డిసెంబర్ 31 వరకు గడువు ఇచ్చారు. ఆ తరువాత చెల్లించే పన్నులకు 2 శాతం అపరాధ రుసుం కూడా వసూళ్ల చేయనున్నారు. ఈ నేపథ్యంలో పన్ను వసూళ్లపై కమిషనర్ భావన అధికారులతో ప్రతి శనివారం సమీక్షిస్తూ లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు.



కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం

ప్రజలు సహకరించాలి



పన్ను చెల్లింపుదారులు నగరపాలక సంస్థకు సహకరించి మొండి, ప్రస్తుత బకాయిలను వెంటనే చెల్లించాలి. పన్నుల చెల్లింపు ద్వారా వచ్చే ఆదాయాన్ని నగరాభివృద్ధికి ముడిపడి ఉన్నందున సహకరించాలని కోరుతున్నాం. సుమారు 500 మంది మొండిబకాయిదారులకు నోటీసులు కూడా ఇచ్చాం. సకాలంలో స్పందించకపోతే కుళాయి కనెక్షన్లు తొలగిస్తాం. అంతేకాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– మనోహర్, డిప్యూటీ కమిషనర్, కాకినాడ నగరపాలక సంస్థ

సూర్యారావుకు సత్కారం



స్టార్ సినీ అవార్డ్స్‌లో సూర్యారావును సత్కరిస్తున్న ప్రముఖులు

బోట్‌క్లబ్: అమ్మమీద ఒట్టు చిత్రంలో పూజారి పాత్రలో నటించి మంచి గుర్తింపు పొందిన కాకినాడకు చెందిన తురగా సూర్యారావుకు ఆదివారం స్థానిక సూర్యాకళామందిరంలో సత్కరించారు. సూర్య నృత్య నికేతన్ ఆధ్వర్యంలో స్టార్ సినీ అవార్డ్స్ సీజన్ టు కార్యక్రమంలో భాగంగా ఆయనను సత్కరించారు. అమ్మ మీద ఒట్టు చిత్రంలో పూజారి వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారని పలువురు వక్తలు కొనియాడారు. ఈ చిత్రంలో ఆయన పాత్ర అందరినీ ఎంతగానో నవ్వించిందన్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు

బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేట సౌమ్య ఎన్‌క్లేవ్‌లో ఉన్న మరకత మణికంఠ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. పీఠం వ్యవస్థాపకులు నందమూరి వినోద్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు చేశారు సాయంత్రం ఊయల సేవ, దీపోత్సవం నిర్వహించారు.

క్రాస్ కంట్రీ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు



కాకినాడ డీఎస్ఏలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాసకుమార్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ డీఎస్ఏ మైదానంలో క్రాస్ కంట్రీ పోటీలకు జిల్లా జట్టు ఎంపికను నిర్వహించారు. ఈ ఎంపికలను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరయ్యారన్నారు. రన్స్, జంప్స్, త్రోస్‌లో క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 5 నుంచి పశ్చిమగోదావరి జిల్లా వేల్పూర్‌లోజరిగే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికల నిర్వహణలో సంఘ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు, గిరి, ప్రసాద్ రెడ్డి, ప్రవీణ్, వీరబాబు, రాజు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



రమణయ్యపేట కొత్తూరు చర్చి సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని కొత్తూరు క్రీస్తు సంఘం చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పాస్టరు ఏసురత్నం మాట్లాడుతూ ప్రజలను వారి పాపాల నుంచి విముక్తి చేయడానికి రక్షకుడిగా ఏసుక్రీస్తు జన్మించారన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అడబాల సత్యనారాయణ మహిళలకు దుస్తులు పంపిణీ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

బీచ్‌లో పారా మోటారింగ్ రిక్రియేషన్



కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో పారా మోటారింగ్ సందడి

కాకినాడ రూరల్: స్థానిక సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో క్రిస్మస్, సంక్రాంతిని పురస్కరించుకుని పర్యాటకులను ఆకట్టుకునేందుకు పారా మోటారింగ్ రిక్రియేషన్ అందుబాటులోకి వచ్చింది. ఆదివారం బీచ్‌లో పారా మోటారింగ్ ద్వారా పలువురు సందడి చేశారు. రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బలరాం నాయుడు, కొస్తవ్ బక్షి, బీజేపీ కాకినాడ శాఖ అధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే జీవితం నాశనం



మత్తు పదార్థాల నిషేధంపై ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని సర్వ నాశనం చేసుకుకోవచ్చని ఆదిత్య డిగ్రీ కళాశాల ఏడీ డాక్టర్ బీఇవీఎల్ నాయుడు పేర్కొన్నారు. డ్రగ్‌ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లక్ష్మీనారాయణ నగర్, అయోధ్యనగర్, శాంతినగర్ మీదుగా నిర్వహించి మదర్ థెరిసా విగ్రహం వద్ద ముగించారు. సే నో టూ డ్రగ్స్ అనే అంశంపై నినాదాలు చేస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం గత వారం ఇదే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కే.చంద్రిక ప్రథమ బహుమతి, జే.మహేశ్వరి ద్వితీయ, ఎ.జాస్మిన్ తృతీయ బహుమతి, పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో ఆశలక్ష్మీ ప్రథమ బహుమతి, ఎ.కమలాదేవి ద్వితీయ బహుమతి, ఎస్.లతీఫ్ తృతీయ బహుమతి సాధించగా, కళాశాల చైర్మన్ శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో తేజేశ్వరరావు అభినందించారు.

ముగిసిన పోలీస్ వార్షిక క్రీడలు



విజేతకు బహుమతి అందజేస్తున్న పద్మ దీపిక, చిత్రంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: కాకినాడలోని పెరేడ్ మైదానంలో ఆదివారం పోలీస్ వార్షిక క్రీడలు ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ క్రీడల ముగింపు కార్యక్రమానికి ఏపీఎస్‌పీ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ హాజరయ్యారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజేతలకు దీపిక చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ, అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడం పోలీస్ శాఖకు గర్వకారణమన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడి జయించడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించడంలో క్రీడల పాత్ర అపారమైందని తెలిపారు. పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఓవరాల్ చాంపియన్‌గా కాకినాడ జిల్లా ఏఆర్ జట్టు నిలిచిందన్నారు. పురుషుల వ్యక్తిగత విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆర్ఐ ఎం.నరసింహమూర్తి, స్త్రీల వ్యక్తిగత విభాగంలో కాకినాడ ఆర్మ్‌డ్ మహిళా పీసీ ఎస్.ప్రశాంతి నిలిచారన్నారు. బృందానికి అభినందనలు తెలిపారు.

నిర్మాణ రంగానికి హోమ్ ఎక్స్‌పో అద్భుత వేదిక



హోమ్ ఎక్స్‌పో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న క్రెడాయ్ కాకినాడ శాఖ అధ్యక్షుడు విజయకృష్ణ

బోట్‌క్లబ్: క్రెడాయ్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 24న మూడు రోజులు పాటు ఆరో హోమ్ ఎక్స్‌పో స్థానిక ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్టు క్రెడాయ్ కాకినాడ శాఖ అధ్యక్షుడు విజయకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక క్రెడాయ్ కార్యాలయంలో ఎక్స్‌పో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ ప్రదర్శనలో 72 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిలో బిల్డింగ్ మెటీరియల్స్, ప్రాపర్టీస్, హోమ్ లోన్స్ వంటి స్టాల్స్ ఉంటాయన్నారు. ఎక్స్‌పో ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ కాకినాడ శాఖ ప్రధాన కార్యదర్శి టీవీ రమణారావు, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు జీవీఎస్‌టీ రాయుడు, కాకినాడ శాఖ ఉపాధ్యక్షుడు చక్రధరరావు, కోశాధికారి పురం రాంబాబు, మాజీ అధ్యక్షుడు వీఎస్ ప్రసన్న పాల్గొన్నారు.

గణితంతో దేశాభివృద్ధి సాధ్యం



గణిత ప్రాముఖ్యత వివరిస్తూ ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: గణితంతోనే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా సైన్స్ అధికారి వినీల్ పేర్కొన్నారు. మల్లాడి సత్యలింగనాయకర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల్ మాట్లాడుతూ విద్యార్థులకు గణితంతో పట్టు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని, సుస్థిరమైన అభివృద్ధి సాధించినప్పుడే మనవ పురోగతి సాధ్యమవుతుందన్నారు. దేశాభివృద్ధి అనేది గణాంకాలపై ఆధారపడి ఉంటుందని, గణితావధాని శ్రీనివాస రామానుజన్‌ను ప్రతి గణిత విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యంగ్‌మైండ్ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ మాట్లాడుతూ రామానుజన్ రచించిన గ్రంథాలకు సమాధానాలు దొరకడం ప్రశ్నార్థకంగా మారిందని, ఆయన రచనలపై వందలాది మంది పరిశోధనలు చేసి డాక్టరేట్‌లు పొందారన్నారు. అనంతరం గణిత శాస్త్రంపై నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, నోరి బలరామకృష్ణ పాల్గొన్నారు. గీతం పాఠశాలలో నిర్వహించిన గణితశాస్త్ర వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ సురభి శారద హాజరై విద్యార్థులు ప్రదర్శించిన గణిత శాస్త్ర ప్రాజెక్టులు ప్రారంభించారు. భారతీయ వేద గణితశాస్త్రవేత్తలను గుర్తుకు చేసి,గణిత శాస్త్ర విశిష్టత తెలియజేసారు. పాఠశాల డైరెక్టర్ సుజ్ఞాన్ గణిత శాస్త్రంలో పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, ముఖ్యంగా పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

కాకినాడ రూరల్: గణిత మేధావి రామాజన్ జయంతిని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, ప్రసాద్ నాయుడు, కొమ్మూరి శ్రీనివాసరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రెడ్నం రాజా, కుమార యాదవ్, రాఘవరావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంత అధికారి సుబ్బారావు మాట్లాడుతూ 1887 డిసెంబరు 22న తమిళనాడులోని నిరుపేద కుటుంబంలో రామానుజన్ జన్మించారని, 12 ఏళ్ల వయసులోనే గణితంలో అసాధారణ ప్రతిభ చూపారన్నారు. సున్న లేకుండా గణితం లేదని తెలియజేసి భారత కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పారు. గణితానికి శిఖరాన్ని ఎగరవేశారన్నారు.

పిల్లలను ప్రోత్సహిస్తేనే బంగారు భవిత

కరప: పాఠశాల స్థాయి నుంచి పిల్లల ఆలోచనా విధానాలను గమనించి, తగిన విధంగా ప్రోత్సహిస్తే వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. ఆహార నియమాలు కూడా పాటించేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. వేళంగిలోని మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత గణితమేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బండ వెంకట్రావు, కాదా వెంకటరమణ మాట్లాడుతూ రామాజన్‌కు ఆసక్తిని కల్గించిన 1729 సంఖ్య గురించి, ఆయన చేసిన గణితశాస్త్ర ప్రయోగాలను, ఆవిష్కరణలను వివరించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గణిత క్విజ్, గణితమోడల్స్ ప్రదర్శన, గణితశాస్త్రవేత్తల మోనో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. తర్వాత జనవిజ్ఞాన వేదిక రూపొందించిన మద్యంలేని కొత్త సంవత్సరాన్ని మనసారా స్వాగతిద్దామని పోస్టర్స్‌ను ప్రదర్శించారు. గ్రామస్తులు మెర్ల వీరయ్యచౌదరి, లయన్ డాక్టర్ బొండా వెంకన్నారావు, తోటకూర సాయి రామకృష్ణ, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్ఎం భారతి, వీఎస్ రెడ్డి, ఏవీకే రామాచార్యులు, వి.రామారావు, ఉమా మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యపేటలో గణిత మేధావి రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు



వేళంగి హైస్కూలులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



వేళంగి హైస్కూలులో పోస్టర్స్ ప్రదర్శిస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, ఎంఈఓలు, గ్రామస్తులు

సూర్యారావు సేవలు మరువలేనివి



దంటు సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న క్లబ్ కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ మాజీ అధ్యక్షులు, దంటు కళాక్షేత్రం వ్యవస్థాపకులు స్వర్గీయ దంటు సూర్యారావు కళాపోషకులని క్లబ్ ఉపాధ్యక్షుడు సీతారామ్ అన్నారు. దంటు సూర్యారావు జయంతినిఆదివారం స్థానిక యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్‌లో నిర్వహించారు. క్లబ్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాటక, కళా రంగాలకు సూర్యారావు చేసిన మరువలేనివన్నారు. ఎంతో మంది కళాకారులను తయారు చేసిన చిత్ర పరిశ్రమకు పంపడంలో ఆయన విశేస కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శులు పీవీ రావు, ప్రభుదాస్, సభ్యులు కె.కృష్ణారావు, విశ్వేశ్వరరావు, మార్ని జానకీరామచౌదరి, కాటంరెడ్డి చంద్రశేఖర్, ఎస్‌కే అమీర్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు అభ్యంతరాల స్వీకరణ

కాకినాడ లీగల్: ఉమ్మడి జిల్లాలో 36 సబ్–రిజిస్టర్ పరిధిలో భూముల మార్కెట్ విలువ పెంపు ప్రతిపాదనలకు సంబంధించి ఆన్‌లైన్‌లో, సబ్ రిజిస్టర్ కార్యాలయంలోని నోటీస్ బోర్డ్‌లో ప్రతిపాదనలు పెట్టారు. ఆ మార్కెట్ విలువలపై ప్రజలకు ఎటువంటి అభ్యంతరాలున్నా మంగళవారం సాయంత్రం వరకూ ఫిర్యాదు చేయవచ్చు. ప్రజల అభ్యంతరాలను స్వీకరించాలని రాష్ట్ర స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఎంవీ శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు పరిశీలించి, ఈ నెల 27న భూ మార్కెట్ విలువ ప్రతిపాదనకు ఆమోదం చేయనున్నారు. మార్కెట్ విలువ జనవరి ఒకటో తేదీ నుంచి అమలు కానుంది.